# గుప్పెట్లో నిప్పులు

— బి. నాగరాజు

"ఎవరమ్మో లోపల? ఇంత నిప్పుదే. చుట్ట కాలుస్తా" అంటూ ఆగంతకుడు గుడిసె ముందు ఒకింత పక్కకు గొంగడేసుకొని, పొందుగా, తీరిగ్గా కూర్చున్నాడు.

చుట్టూ చీకటి చిక్కగా అలముకొని ఉంది. ఎలాంటి అలికిడి ఆ దరిదాపుల్లో మచ్చుకైనా లేదు.

అది బాయిగడ్డ మీది గుడిసె. ఆ గుడిసెలో బంగారమ్మ తన బిడ్డడికి చనుగుడుపుతున్నదప్పుడు.

ఆగంతకుని పిలుపుకు గతుక్కుమంది.

ఆ వేళకు తానెరిగినంత వరకు ఎప్పుడూ ఒక్క పురుగైనా రాలేదు.

మగమనిషిలేని సమయాన ముక్కూముఖమూ తెలియని మనిషి రావడం, ఆమె కొకింత కంగారు కలిగించింది.

పసి నిసుగును పక్కన పడుకోబెట్టి లేచింది. నెత్తి మీదుగా కొంగు వేసుకుంది. పొయ్యిలోంచి పిడికెడు నిప్పులు దీసుకొని, వెలుపలికి వచ్చి, తల ఎత్తకుండానే "నిప్పులు" అంది.

ఆగంతకు డాశ్చర్యంతో కొన్ని లిప్తల పాటు ఆమె వైపు తీక్షణంగా చూశాడు. చీకట్లో ఆమె మోము స్పష్టంగా కనిపించలేదు. చేత్తో నిప్పులు పట్టుక రావడం చూసి "ఇది మనిషిలా ఉన్నా మనిషి మాత్రం కాదు" అని తనలో తాననుకొని రుమాలు కొంగు పట్టాడు.

బంగారమ్మ నిప్పుల్ని అతడు పట్టిన రుమాలు కొంగులో వేసి, గిరుక్కున వెనుదిరిగి, గుడిసెలోకి దూరింది.

ఆగంతకుడు వాటిని మూట కట్టుకొని లేచాడు. లేచి క్షణం కూడా నిలువకుండా వడివడిగా అడుగులేస్తూ, తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు.

ఆ అగంతకుడు మళ్ళీ రాకుండా హడలగొట్టాలని బంగారమ్మ యత్నించింది. కాని అతడు అందుకు తానేమీ తీసి పోలేదన్నట్టు, ఆమె ఎత్తుకు పైఎత్తులా ఆ నిప్పుల్ని మూట కట్టుకపోయాడు. దానితో బంగారమ్మ ఇసుమంత భయానికి లోనయింది. అది ఆమెలో నిప్పు రవ్వలా రాజుకుంది.

* * * *

ఆ బాయిగడ్డ చుట్టూ ఎటు చూసినా చాలా వరకు చెట్లు చేమలు, గుబురు గుబురు పొదలు, ముళ్ళడొంకలు. పట్టపగలైనా అటు రావాలన్నా, పోవాలన్నా పురుగూపుట్రా అనే భయంతో ఎవరూ రారు. ఇక రాత్రి మాట వేరుగా చెప్పేదేముంది?

ఆగంతకుడు బాయిగడ్డ నుండి ఫర్లాంగు దూరం వెళ్ళాక మంచి వయసులో ఉన్న కోడెకాడు ఎదురయ్యాడు. ఇరువురూ ఒకరి ముఖం ఒకరు పరిశీలనగా చూసుకున్నారు.

"పోయేది బాయిగడ్డ మీది గుడిసెకేనా?" అని అడిగాడు ఆగంతకుడు.

"అవును. నీ కెట్లా తెలుసది?"

"ఈ పిల్లబాట పోయేదక్కడికే గదా. ఈ మాత్రం తెలుసుకోలేని ఎడ్డోడివి. అందుకే ఆ దయ్యం నిన్ను బుట్టలో వేసుకుంది."

"ఎవరు? మా ఇంటిదా?"

"ఓ యబ్బో! అది, నీ ఇంటిదా? కాలు దొక్కి కళ్యాణ మాడావా? కాదు. ఉంచుకున్నదను– ఎక్కడ దాపురించింది? ఎలా జత కలిసింది నీకు? ఎవరూ, ఏం పేరూ, ఏ ఊరో ఏమన్నా తెలుసా? తెలియదు. నువ్వడిగినా అది చెప్పదు. నాకు తెలుసు." అని కాసేపు మౌనంగా ఉండిపోయాడాగంతకుడు.

నిజమే. ఎప్పుడడిగినా చెప్పలేదు. విషయాన్ని ఎప్పటి కప్పుడు దాట వేసింది. హొయలు పోతూ, మరులు గొలుపుతూ మనిషిని మరో వైపు మరల్చుకుంది.

"ఏడాదికి పైగా దాని పక్కలో పంటున్నావుకదా! ఎప్పుడైనా అదీ నిద్దర్లో ఉండగా నువ్వు నిద్రలేచి చూశావా? లేదు. చూడలేదు. ఈ రాత్రి చూడు. నువ్వు చూసేలా చేస్తా. నే నిచ్చేది నీ నడుం కట్టులో పెట్టుకో. నీకు నిద్దరే రాదు. వచ్చినట్లు నటించు, చాలు. దాని అసలు రంగు బయటు పడుతుంది చూడు." అని తన రుమాలు కొంగు ముడి విప్పాడు.

నిప్పులు కణకణలాడు తున్నాయి.

"ఏమిటవి?" అని కోడెకాడు అప్రయత్నంగా అడిగాడు.

"నిప్పులు. అయినా భయపడకు. ఇవి నీ చెయ్యిని కాల్చవు. నిన్నేమీ చేయవు. నీకేమి కాదు." అంటూ ఒక నిప్పు ముక్కను కోడెకాడి చేతిలో పెడుతూ "రేపీవేళ ఇక్కడే కలుద్దాం." అని అటునుండి కదిలాడు ఆ ఆగంతకుడు. క్షణంలో నే కనిపించకుండా పోయాడు. ఎటు పోయాడో! ఏమయ్యాడో!! కోడెకాడికి అర్థం కాలేదు.

అంతేకాదు. ఎవరతను? ఇక్కడేం పని? తన ఇంటిదాని సంగతేమిటి? అతని కెట్లా తెలుసు? ఆ ఇద్దరి మధ్య ఉన్న సంబంధం ఎట్టిది, అనే ప్రశ్నాపరంపర అతన్ని కలవర పరచింది. అన్నిటికన్నా చిత్రమయింది ఇంగలం. పట్టినా, ముట్టినా కాల్చక పోవడం.

అరచేతిలో ని నిప్పును చూస్తూండగా గతంలోని స్మృతులు తీలగా మెదిలాయి.

* * * * * * *

ఆ కోడెకాడి పేరు సిద్ధులు.

ఏడాదికి ముందు బంగారమ్మ తారసిల్లింది.

ఆ రోజు ఆదివారం–

పైగా అమావాస్య–

అదీ అర్ధరాత్రి–

అంతా నిశ్శబ్ద నిశీధి. అంతటా నిశ్శబ్దమే నిశ్శబ్దం. కమ్మ కదిలినా వినిపించేలా ఉందా నిశ్శబ్దం. స్మశానంలో లా భయంకర నిశ్శబ్దమది.

సిద్ధులు ఎప్పటిలా ఆ మధ్య రాత్రి నిద్ర లేచాడు. లేచి గుడిసె వెనుక వైపుకు వెళ్ళాడు. కాసేపయ్యాక తిరిగి వచ్చి, నులక మంచం మీద మేను వాల్చి, కండ్లు మూసుకున్నాడు.

అంతలో -

ఎవరో వస్తున్న శబ్దం. పూరి గుడిసె వైపే వస్తున్న శబ్దం. ఆ శబ్దం గజ్జెల శబ్దం. అడుగు తీసి, అడుగు వేస్తుంటే అయ్యే శబ్దం. అడుగులు వేస్తున్న విధానంలో ఆమె నిబ్బరం ఎంతో గుండె నిబ్బరం ఉట్టిపడుతుంది. ఆ మువ్వల సవ్వడికి సిద్ధులు లేచి కూర్చున్నాడు.

ఎదురుగా ఓ స్త్రీ మూర్తి. వెన్నెల కన్నెలా కన్నులు మిరుమిట్లుగొలిపేలా ప్రత్యక్షమయింది.

తెల్లని చీర. మల్లెల కన్నా తెల్లగా, ఉల్లి పొరకన్నా సన్నగా ఉందా చీర. ఆ చీరలో గులాబీ గుభాళింపును, నునుపును, నిగారింపును, పునికి

**దెయ్యాల కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ!**

పుచ్చుకున్న పసిమి ఛాయదేహం. ఆ స్త్రీ మూర్తి నిలువుగా ఒక దీపకళికలా వెలుగుతూ నిల్చుంది. ఉలుకూ పలుకూ లేకుండా, కదలక మెదలక, క్రీగంట చూపులతో బంగారు బొమ్మలా ఉంది. అందుకేనేమొ! సిద్ధులు ఆ తరువాత బంగారమ్మ అని పిలుచుకున్నాడు.

సిద్ధులు కిలాంటివి అనుభవంలో లేవనికాదు. ఉన్నాయి.


రెండేళ్ళ క్రితంలో ఆయా వయసుల ఆడవాళ్ళు, చిత్త చాపల్యానికి లోనయి, అదును చూసుకొని, ఆకర్షించడానికి యత్నించారు కొందరు. సిగ్గు యెగ్గు, బుగ్గిలో కలిపి మనసులోని మాటను తెలిపి, ప్రాధేయ పడ్డారు మరికొందరు. అయినా సిద్ధులు ఎవరికీ లొంగిపోలేదు.

కారణం?

కట్టుకున్న పెళ్ళాం తనను కాదని ఎవరితోనో లేచి పోవడం. ఎంతో ప్రేమగా, ఆరాధనగా చూసుకున్నా భార్య మోసానికి గురయ్యాడు. అంత వరకూ ఆడవాళ్ళ పట్ల ఉన్న నమ్మకం పోయింది. బదులుగా అతనిలో విరక్తి విముఖత చోటు చేసుకున్నాయి.

దేవకన్యలాంటి చిన్నది ఎదురుగా కనిపిస్తుంటే ఏమి చేయాలో వెంటనే తోచక సందిగ్ధంలో పడి కొట్టు మిట్టాడ సాగాడు సిద్ధులు. అంటే పునరాలోచనలో పడ్డాడన్న మాట!

అతనిలో ఎలాంటి స్పందన లేక పోవడంతో అటు నుండి వెళ్ళిపోయింది. అలా అని తన యత్నాన్ని మానుకోలేదు.



మూడవ నాటి మధ్య రాత్రి–

''నువ్వెవరో తెలియదు. గుడిసె ముందుకు వచ్చి లో పలికి రావు. ఎందుకని?" అని అడిగాడు సిద్ధులు.

"ఇంటి ముందుకు వచ్చిన దాన్ని లో పలికి రమ్మంది

# గుప్పిట్లో నిప్పులు

రానా? సందేహ మెందుకు?" అంది ఆ బంగారు బొమ్మ.

"ఒకసారి మోసపోయాను. మరోసారి మోస పోతానేమో నని భయం. నాతో చచ్చేదాకా ఉండాలని ఉంటేరా." అని రెండు చేతులు ముందుకు చాచి, రెండడుగులు ముందుకేశాడు సిద్ధులు.

ఆ పైడి బొమ్మ ఆనంద పారవశ్యంతో చెంగున ఒక గెంతు గెంతి, సిద్ధులు బాహువుల్లో చేరిపోయి, "నువ్వు మనసు పడ్డంత కాలం నిన్నొదిలి పోను. నీతో నే ఉంటా" తన్మయురాలై అంది.

* * * * * * *

ఆగంతకు డిచ్చిన నిప్పును నడుము కట్టులో పదిల పరచుకొని, గుడిసెకు దారి తీసాడు సిద్ధులు.

గుడిసెలోకి వచ్చినా, తనను గమనించని బంగారమ్మతో "బంగారం! ఏందే చిన్న బోయింది నీ ముఖం?" అని అడిగాడు.

ఆ పలుకరింపుతో బంగారమ్మ ఉలికిపడి లేచింది.

"ఏం లేదు. కడుక్కొని రాండి తిందురు." అంది.

"ఆకలి లేదే. నువ్వు తిను."

"ఏమిటో పగలు తిన్నది తిన్నట్టే ఉంది." అని పక్క పరిచి పసివాణ్ణి పక్కలో వేసుకుంది.

సిద్ధులు ఆమె పక్కనే పండుకొని, కండ్లు మూసుకొని, నిద్రకుపక్రమించినట్లు ఆవలింత తీసాడు.

బంగారమ్మలో దిగులు ఆకాశం నిండా మబ్బులు క్రమ్ముకున్న ట్లయింది. ఎంత ఆలోచించినా ఎటూ తోచని స్థితిలో చిక్కుకుంది. చివరికి ఏమయితే అదే అవుతుందిలే అనే నిర్ణయానికి వచ్చింది. దీపాన్ని ఆర్పేసే ముందు సిద్ధులు వైపు తిరిగి, కుడిచేతిని పై నుండి కిందికి దిగదూడ్చినట్లు ముఖం మీద కదిలించింది. ఆ తరువాత దీపం తట్టు ముఖం తిప్పింది.

బంగారమ్మ కాస్త నోరు దెరిచింది. నోట్లోంచి నాలుక క్రమంగా ముందుకు సాగుతూ పోయి దీపాన్ని ఆర్పేసింది. ఆనక నాలుక యధావిధిగా కుదించుక పోయింది. కండ్లు మూసుకొని నిద్రకుపక్రమించింది.

బంగారమ్మ నిద్రాదేవి కరుణా కటాక్షాలకు లోనయిన తీరుగా ఆమె శరీర పరిమాణం మూడవ వంతు పెరిగింది. పసిమి ఛాయ దేహం పోయి, మసిబారి నట్లయింది. తల వెంట్రుకలు ఎలుగుబంటి బొచ్చులా మారాయి. కనుగ్రుడ్లు పైకి ఉబికి పోయాయి. కోరపండ్లు, చేతి గోళ్ళు అంగుళం మేర ముందు కొచ్చాయి. శ్వాసక్రియ లయబద్ధంగా వినిపిస్తుంది. గుర్రు సంగతి ఏం చెప్పేది?

ఇదంతా ఓ కంట కనిపెట్టిన సిద్ధులు గుండె దడ హెచ్చయి పోయింది. భయంతో ఒంటి నిండా చెమట పట్టింది. చడీ చప్పుడూ గాకుండా గుడిసె లోంచి బయట పడ్డాడు. క్షణం వృధా చేయకుండా ఊళ్ళో పడేదాకా కాళ్ళకు బుద్ధి చెప్పాడు.

* * * * * * *

పొద్దు పొడువక ముందు, ఇంకా మబ్బు మబ్బుగా ఉండగా బంగారమ్మ నిద్రలేచింది. పక్కన సిద్ధులు కనిపించలేదు. నెత్తి మీద పిడుగు పడ్డట్లు తోచింది. తన నిజ రూపం సిద్ధులు కంట బడ్డట్లు గ్రహించింది. తన పట్ల అసహ్యం కలిగి వెళ్ళి పోయి ఉంటాడు. ఇక తాను తప్పుకోక తప్పదనుకుంది.

* * * * * * *

సిద్ధులు ఆగంతకుని రాకకై నిరీక్షిస్తున్నాడు.

అంతలో గజ్జెల శబ్దం సమీపిస్తున్నట్లు వినిపించి అటు చూశాడు.

బంగారమ్మ వస్తోంది. ఒంటరిగా కాదు. జంటగా ఆగంతకునితో కలిసి వస్తోంది.

సిద్ధులు చూపులు ఆశ్చర్య సంకేతాలయ్యాయి!

"ఈయన నా మొగుడు. ఎవతి ఆకర్షణలోనో పడి నన్నొదిలి పోయాడు. మనసు మళ్ళి నన్ను వెతుక్కుంటూ వచ్చాడు. నేను వెళ్ళి పోతున్నాను. నీకు మోసం చేయడం లేదు. ఒక ఏడాది పాటు కలిసి ఉన్నందుకు ఒక పిల్లాడిని కన్నాను. వాణ్ణి కన్నది నేనైనా వాడు నీ కొడుకే. కంటికి రెప్పలా చూసుకో" అని బంగారమ్మ ముందుకు కదిలింది. ఆగంతకుడామె ననుసరించాడు.

సిద్ధులు బాయి గడ్డమీది గుడిసెకేసి పరుగు దీసాడు. ●

త్వరలో మరో సస్పెన్సు సీరియల్
డా. కొత్త రవీంద్రబాబు
మోహినీ తాండవం!
ఆంధ్రసచిత్రవారపత్రికలో ప్రారంభం

